విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారక్ష

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: రాష్ట్ర ప్రజలు ఏ ఒక్కరు కూడా ఎటువంటి వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడకుండా ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆశయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. మండలంలోని అరకు పంచాయతీ పరిధిలో గల జైపూర్ జంక్షన్‌లోని గిరిజన బాలికల ఆంగ్ల పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తూ ఆరోగ్య వంతులుగా ఉండేందుకు వీలుగా జగనన్న అమలు చేసిన ఆరోగ్య సురక్షను అనారోగ్య గిరిజనులు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది ఏర్పాట్లు చేసిన శిబిరాల నిర్వహణ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, వంచాయతీ సర్పంచ్ జి.శారద, ఎంపీపీ బాగా ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు సిహెచ్ జానకమ్మ, ఐటీడీఏ పీవో అభిషేక్, వైద్య ఆరోగ్యశాఖ చీఫ్ సెక్రటరీ నివాస్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా, కిల్లోగూడ, దుంబ్రిగుడ వైద్యాధికారులు కే కరుణ, పాంగి రాంబాబు పాల్గొన్నారు.

యస్.రాయవరం: మండలంలోని లింగరాజుపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. బుధవారం గ్రామంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రమూర్తి, తహశీల్దార్ విజయకుమార్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ గోపిరాజు, వైద్యాధికారులు శక్తి ప్రియ, రాజేశ్వరి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: పేద ప్రజల కొరకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారని భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఆనందపురం మండలంలో గొట్టిపల్లి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభించి రోగులకు పలు రకాల వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పద్మ, ఎంపీడీవో అడపా లవరాజు, డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, భీమిలి యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకట జగన్, స్థానిక సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, మండల యూత్ ప్రెసిడెంట్ చందక అప్పలస్వామి, మాజీ గ్రంథాలయ చైర్మన్ మణి శంకర్ నాయుడు, మహంతి శివాజీ, వైద్య సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన పీవీ సురేష్

విశాలాంధ్ర - మల్కాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్ బుధవారం స్థానిక శ్రీహరిపురం ఉడా కాలనీ పీహెచ్‌సీ హాస్పిటల్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యంపై స్థానికులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, స్థానికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన గాదెగుంట గ్రామస్తులు

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని నుర్మతి పంచాయతీ గాదిగుంట గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు మసాడి భీమన్న, తల్లె త్రిమూర్తులు, కిల్లో రాజన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ గంగులయ్య హాజరయ్యారు. జనసేన పార్టీ యొక్క సిద్ధాంతాలు, ప్రస్తుత గిరిజన రాజకీయాలు రాష్ట్ర రాజకీయాలు పరిస్థితులపై వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ నాయకులు తల్లే త్రిమూర్తి, మండల అధ్యక్షులు మసడి భీమన్న, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తాంగుల రమేష్, బూత్ కన్వీనర్ కొర్ర భాను ప్రసాద్, చింతపల్లి మండల బూత్ కన్వీనర్ ఉల్లి సీతారాం, తల్లె కృష్ణ, ఓలేసు, కేకోటి రాము, వి.సోమరాజు, అంగధరావు, వీర మహిళ గండేరి పార్వతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామ సభ

విశాలాంధ్ర - అరకులోయ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఓ చక్కటి వేదిక అని గన్నెల సర్పంచ్ శెట్టి బొజ్జ అన్నారు. బుధవారం గన్నెల గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ శెట్టి బొజ్జ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యలు, వీధిలైట్లు, సిసి రోడ్లు మిగతా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లబ్ధిదారులకు పని దినాలు కల్పించే విధంగా గుర్తించాలన్నారు. సమస్యలను త్వరలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాజేంద్ర, వీఆర్వో సాయిబాబా, వైసీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి ఆయాలు, ఆశ వర్కర్లు, సచివాలయ కన్వీనర్, గృహ సారథులు, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దువ్వాడ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ - కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం జంక్షన్ నుండి దువ్వాడ రైల్వే స్టేషన్ వరకు రోడ్లు, డ్రైన్లు, పాదచారుల దారి ఏర్పాటు చేయడం కోసం 11 కోట్ల 39 లక్షల రూపాయలు అభివృద్ధి పనులకు విశాఖ నగర్ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంతో పాటు నగర పరిధిలో ఉన్న వార్డులను కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఈ ప్రాంత ట్రాఫిక్ సమస్య తీరుతుందని ఆమె అన్నారు. స్థానిక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ దువ్వాడ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఈ రోడ్ల విస్తరణ మరింత ప్రగతికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 86వ వార్డు కార్పొ రేటర్ లేళ్ల కోటేశ్వరరావు, వైసీపీ నాయకులు దామ సుబ్బారావు, దువ్వాడ సిఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

9న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

విజన్ ఐటిఐ కరస్పాండెంటు జేవీ ప్రభాకర్

విశాలాంధ్ర - పాయకరావుపేట: నర్సీపట్నం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 9న జరిగే జాబ్‌మేళాను ఐటిఐ పూర్తి చేసుకున్న వారు సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని విజన్ ఐటిఐ కరస్పాండెంటు జేవీ ప్రభాకర్ తెలిపారు. విజన్ ఐటిఐలో ఐటిఐ పూర్తి చేసిన విద్యార్థులను కాన్వకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 180మంది విద్యార్థులను ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ ఐటిఐ పూర్తి చేసుకున్న వారికి కూడా స్వదేశంలోనూ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో విశాఖ ఓల్డ్ ఐటిఐ కన్వీనర్ వై.ఉమాశంకర్, నర్సీపట్నం ఐటిఐ కన్వీనర్ డి.శ్రీనివాసాచారి, పాయకరావుపేట ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, విజన్ ఐటిఐ ప్రిన్సిపాల్ యుకె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయండి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల కించాయిపుట్టు పంచాయితీ పరిధిలో గల గుమ్మ సిర్గం పుట్టు నుండి బరడ పంచాయతీ కేంద్రం వరకు తారు రోడ్డునిర్మాణం పనులు పూర్తయ్యాయి. రోడ్డు నిర్మాణాలు పూర్తిచేసిన సంబంధిత అధికారులు గుమ్మ సిర్గం పుట్టు గ్రామ సమీపంలో సుమారుగా 50 మీటర్ల మేర రోడ్డును, బరడ గ్రామ సమీపంలో గల కల్వర్టు తోపాటు సుమారుగా 30 మీటర్ల రోడ్డు అసంపూర్తిగా విడిచిపెట్టారు. దీంతో రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గుమ్మ సిర్గం పుట్టు నుండి బరడ పంచాయతీ కేంద్రం వరకు ఈ పదేళ్లలో రెండు దఫాలుగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా తారు రోడ్డు నిర్మాణాలు చేపట్టినప్పటికీ కల్వర్టు వద్ద, సిర్గం పుట్ గ్రామ సమీపంలో గల రోడ్డును కనీసం సిసి రోడ్డులు వేయకపోవడంలో గల ఆంతర్యం ఏమిటో పంచాయతీ రాజ్ శాఖ అధికారులకే తెలియాల్సి ఉందని ప్రజలు అంటున్నారు. సుమారు 30 మీటర్ల పైన నిర్మాణాలకు విడిచిపెట్టి అసంపూర్తిగా వదిలివేయడంతో ఆ ప్రాంత ప్రజలు పంచాయతీరాజ్ శాఖ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పూర్తి చేయాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర సుందరీకరణలో భాగంగా కూడళ్ళ అభివృద్ధి చేస్తున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. బుధవారం ఆమె నాలుగవ జోన్ పరిధిలోని జగదాంబ కూడలి అభివృద్ధి పనులకు పార్లమెంటు సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ, దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగర సుందరీ కరణలో భాగంగా కూడళ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. జగదాంబ కూడలితోపాటు క్లాక్ టవర్ నిర్మాణానికి స్మార్ట్ సిటీ నిధులతో 2.3 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సాధ్యంలో విశాఖ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణ, జోనల్ కమిషనర్ శివప్రసాద్, స్మార్ట్ సిటీ కార్యనిర్వాహక ఇంజనీరు, ఇతర జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకి గురై గిరిజనుడు మృతి



విశాలాంధ్ర - పెదబయలు: మండలంలోని మారుమూల లింగేటి పంచాయతీ కేంద్రంలో పాము కాటుకు గురై ఒక గిరిజనుడు మృతి చెందారు. లింగేటి గ్రామానికి చెందిన కుర్ర నాగేశ్వరరావు ఈనెల 2వ తేదీన పాముకాటుకు గురవడంతో పాడేరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు వారి బంధువులు మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు విలేకరులకు తెలిపారు. కుటుంబానికి ప్రభుత్వం తరఫున నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

మీడియాపై దాడులు ఖండించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: న్యూస్‌క్లిక్ కార్యాలయంపై జరిగిన దాడి మీడియా ప్రాథమిక హక్కు అయిన భావ ప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి అని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. మోదీ ప్రభుత్వం గడిచిన తొమ్మిదేళ్లుగా బిబిసి, న్యూస్ లాండ్రీ, దైనిక్ భాస్కర్, భారత్ సమాచార్, కశ్మీర్ వాలా, వైర్ వంటి వివిధ మీడియా సంస్థలను అణచివేయడానికి, వేధించ డానికి, బెదిరించడానికి దర్యాప్తు సంస్థలను సాధనాలుగా చేసుకుంటుందని విమర్శించారు. తాజాగా న్యూస్ క్లిక్‌తో సంబంధమున్న వారిపై దాడులు చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాలు చెప్పే జర్నలిస్టులపై నిరంకుశంగా దాడులు చేయడం ఎంతమాత్రం సహించరానిదన్నారు. అప్రజాస్వామిక చర్యకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర వాదులు, మేధావులు ముందుకు వచ్చి ఈ నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

మోడీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై బ్లాక్ డే

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపుమేరకు అనకాపల్లి నెహ్రూ జంక్షన్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కో కన్వీనర్ బాలు గాడిలు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ సహాయ హెూం మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు రైతు ర్యాలీపై కర్కశంగా వాహనంతో నలుగురి రైతులు, ఒక విలేకరి మరణానికి కారణమై సంవత్సరం గడుస్తున్నా నేటికీ అరెస్టు చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక చట్టాలు, విద్యుత్ సంస్కరణల చట్టం 2020ను మార్పులు చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా రైతు సంఘాలతో ఎటువంటి చర్చలు జరపకపోవడం దారుణ మన్నారు. ఈ కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఏ.బాలకృష్ణ అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు కొరుబిల్లి శంకర్రావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.శంక రరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోన లక్ష్మణ్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కాళ్ళ తేలయ్య బాబు, ఎస్‌కెఎం నాయకులు కొల్లి సత్యారావు, వియ్యపు రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మే హక్కు మోడీకి లేదు

విశాలాంధ్ర - విశాఖ: స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోడీకి లేదని ఏఐటీయూసీ ఆటో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. జీవీఎంసీ ఎదురుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఉద్యమ నిరాహార దీక్ష శిబిరంలో బుధవారం ఏఐటీయూసీకి అను బంధంగా ఉన్న వివిధ ప్రాంతాల ఆటో డ్రైవర్లు నిరా హార దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ఫ్యాక్టరీ ఏ ఒక్కరి దయాదాక్షిణ్యాలపై ఇక్కడ నిర్మాణం కాలేదని అన్నారు. పలువురి ప్రాణ త్యాగాలు, బలి దానాలతో ఏర్పాటైందని చెప్పారు. ప్రజల ఆస్తితో స్థాపించిన స్టీల్ ప్లాంట్ రాష్ట్రానికి భారీ పరిశ్రమగా ఉందని తెలిపారు. ఈ ప్లాంట్‌పై 40 వేల మంది కార్మికులతో పాటు మరో 2 లక్షల మంది పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఇటు వంటి ప్లాంటును కారుచౌకగా దక్షిణ కొరియాకు చెందిన సంస్థకు పోస్కోకి అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా దుర్మార్గ మన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ఆనాడు సిపిఐ శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు పదవులకు రాజీనామాలు చేసి ఉద్యమాల్లో పాల్గొని సాధించిన సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ అని అన్నారు. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా ప్రజలకు లిక్విడ్ ఆక్సిజన్ అందించి ప్రాణాలు కాపాడారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్యాగాల ద్వారా సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను పోరాటాల ద్వారా కాపాడుకుంటామని తెలియజేశారు. ఈ శిబిరంలో ఏఐటీయూసీకి జిల్లా సహాయ కార్యదర్శి పడాల గోవిందు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం. మన్మధరావు, అద్దూరి శంకర్, శివ, ప్రొఫెసర్ సూరప్పుడు, లంక గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బడి బయట ఉన్న పిల్లల వివరాలు సేకరించండి

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: బడి బయట ఉన్న పిల్లల పూర్తి వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మండల విద్యాశాఖా ధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులతో బుధవారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వ హించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనాలు లేని పాఠశాలలు, బడిబయట ఉన్న విద్యార్థుల వివరా లను అడిగి తెలుసుకున్నారు. మండలాల వారీగా దీర్ఘ కాలంగా పాఠశాలకు విద్యార్థులు ఎందుకు రావడం లేదని ఆరా తీసారు. గ్రామ సర్పంచులతో మాట్లాడి భవనాలు లేని పాఠశాలల వివరాలు సేకరించాల న్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని చెప్పారు. ప్రభుత్వం కొత్త పాఠశాలలు మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.గౌరీ శంకరరావు, ఎంఈఓలు, ఎటిడబ్ల్యూలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రజినిని కలిసిన శాంతకుమారి

విశాలాంధ్ర - అరకులోయ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య శాఖ మంత్రి విడుదల రజినిని కాంగ్రెస్ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి పాంచిపెంట శాంత కుమారి బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గిరిజన ప్రాంతంలోని ఆసుపత్రులలో పూర్తిస్థాయి వైద్య నిపుణులు, పరికరాలు, సదుపాయాలు కల్పించాలని వినతి అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేకంగా స్త్రీ వైద్య నిపుణులు, ఫిజియోథెరపీ తదితర వైద్య నిపుణులు పూర్తిస్థాయిలో ఎక్సరే, స్కానింగ్ పరికరాలు అందుబాటులో లేకపోవడం వలన విశాఖలోని ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలలో గత నాలుగు సంవత్సరాల నుండి హెల్త్ వాలంటీర్లను రెన్యువల్ చేయకపోవడం వలన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అరకులోయ 100 పడకల ఆసుపత్రికి ఏ గ్రేడ్ ఉన్నప్పటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వం డి గ్రేడ్‌కి తగ్గించడం వలన గిరిజన ప్రాంత ప్రజానికానికి అన్యాయం జరిగిందని ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు, పిసిసి డెలిగేట్ మెంబర్ పాచి పెంట చిన్నస్వామి, అరకులోయ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గొల్లూరి పద్మ, అరకు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వి. గంగాధర్, దుంబ్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తడబారికి భీమరావులు పాల్గొన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌గా ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య జేమ్స్ స్టీఫెన్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను తీసుకొని పదవి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య స్టీఫెన్‌ను ఏయూ పాలక మండలి సభ్యులు, ప్రిన్సి పాల్స్, విభాగాధిపతులు, ఆచార్యులు అభినందించారు. ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ ప్రస్తుతం ఏయూలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ నేషనల్ చైర్ ప్రొఫెసర్‌గా, ఏయూ ట్రాన్స్ డిసిప్లీనరీ హబ్ డీన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆయన 21 సంవత్సరాల సుదీర్ఘ బోధన అనుభవనాన్ని కలిగి ఉన్నారు. పది సంవత్సరాలుగా పరిపాలనా సంబంధమైన పదవులను నిర్వహించారు. ఏయూ పాలక మండలి సభ్యునిగా గతంలో పనిచేసారు. నగరంలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా 9 సంవత్స రాలకు పైగా సేవలు అందించారు. ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ కంప్యూటర్ సైన్స్ - సిస్టమ్స్ ఇంజనీరింగ్లో పిహెచ్.డి పూర్తిచేసారు. ఆయనకు 32 పేటెంట్లు, కాపీరైట్లలు కలిగి, 9 జాతీయ, అంతర్జాతీయ గ్రాంట్స్ సాధిం చారు. ఇప్పటి వరకు పలు జాతీయ, అతర్జాతీయ పబ్లిషర్స్ లో 11 పుస్తకాలను రచించారు. ఐఎస్బిఎన్ నంబరు కలిగిన నాలుగు ఎడిటెడ్ వాల్యూమ్స్, 60 కిపైగా పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఇప్పటి వరకు ఆయన పర్యవేక్షణలో 8 మంది పిహెచ్‌డిలు పూర్తిచేసి డాక్టరేట్లు అందుకున్నారు.

తపాల ఉద్యోగుల సమ్మె

విశాలాంధ్ర - గొలుగొండ: ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూని యన్ పిలుపు మేరకు కేడీ పేట పోస్టాఫీస్ వద్ద 18 బ్రాంచీలు ఉద్యోగులు సమ్మె చేపట్టారు. 8 గంటల పనిదినములు, పెన్షన్ అమలు చేయాలని, గ్రూపు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, పైల కృష్ణ, గవరరాజు, చినబ్బాయి, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛలో స్టీల్‌ప్లాంట్

విశాలాంధ్ర - భీమిలి: విశాఖ ఉక్కు రక్షణకై చలో స్టీల్‌ప్లాంట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు సీపీఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు అంబేద్కర్ కూడలి వద్ద ఆటోలో ప్రచారం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ లక్షమందికి ఉపాధి కల్పిస్తుందని అటువంటి ప్లాంట్‌ను కార్పొరేట్లకు అమ్మకానికి పెట్టడం తగదన్నారు. గురువారం జరిగే బహిరంగ సభకు సీపీఎం ఆల్ ఇండియా కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి హాజరవుతారని, ప్రజలంతా సభను జయప్రదం చేయాలని కోరారు.

మండపం నిర్మాణానికి విరాళాలు



విశాలాంధ్ర - పరవాడ: మండలంలోని కాలపాక పంచాయతీలో శివుని ఆలయ మండపం నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు రూ.10 వేలు, కన్నూరు ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీను రూ.10వేలను కలపాక సర్పంచ్ బొండా కనకా రావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాతలకు సర్పంచ్ కనకారావు, ఆలయ కమిటీ పెద్దలు ధన్యవాదములు తెలిపారు.

చంద్రబాబును విడుదల చేయాలని వినతి

విశాలాంధ్ర - వి.మాడుగుల: చంద్రబాబు వెంటనే విడుదల చేయాలని కోరుతూ మాడుగుల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పివిజి.కుమార్, మాజీ శావసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు బుధవారం మాడుగులలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశ్యంతో ఎలాంటి ఆధారాలు లేని అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు లక్ష్యంగా సుమారు 22 రోజులుగా జైల్లో పెట్టి 73 సంవత్సరాలు వయస్సు గల వ్యక్తిని అన్యాయంగా మానసికంగా ఇబ్బందులు పెట్టి టిడిపి పార్టీని లేకుండా చేయాలని చూస్తున్నారన్నారు.

మంత్రి విడదల రజినిని కలిసిన రౌతు

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినిని భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రౌతు శ్రీను మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్ యార్డులో పలు సమస్యల గురించి మంత్రి వద్ద ప్రస్తావించారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు.

మెట్ల మార్గాన్ని పరిశీలించిన ఈఓ

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి మెట్ల మార్గాన్ని పరిశీలించారు. మెట్ల మార్గంలో ఉన్న ప్రకృతి జలధారలకు పూర్వ వైభవం తీసుకురావాలని ఇంజినీరింగ్ ఈఈ రాంబాబు, డిఇ నాగేశ్వరరావు ఏఈ రవిరాజ్‌లకు ఆదేశించారు. ఆకాశధార ప్రవాహంకు అడ్డంగా ఉన్న చెత్తా, చెదారంను తొలగించి మెట్ల మార్గం ద్వార స్వామివారి దర్శనంకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉపయోగంలోకి తీసుకురావలని అన్నారు. రానున్న విజయదశమి రోజు సింహాద్రి అప్పన్న కొండక్రింద ఉన్న ఉద్యానవనంలో జమ్మివేట (ఉత్సవానికి) రానున్నారని కనుక మెట్ల మార్గంలో ఉన్న రాళ్ళు, చెత్తా, చెదారం తొలగించాలన్నారు.

వర్చువల్‌గా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - పద్మనాభం: వర్చువల్ ప్రోగ్రాంలో పద్మనాభం మండలం ప్రాంగణంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ మల్లికార్జునరావు, ఆర్డీఓ, స్థానిక ఎంపీపీ రాంబాబు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.రాంబాబు, జిల్లా కలెక్టర్ వారిని శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వల్ల మండలంలో కాక మన జిల్లాలోనే చిరుధాన్యాలు ప్రాసెసింగ్ యూనిట్ మన దగ్గరలోనే అందుబాటులోనే తీసుకురావడం అభినందనీయమన్నారు.

టీడీపీ దీక్షలకు సీపీఐ మద్దతు

విశాలాంధ్ర - చింతూరు: చంద్రబాబు అక్రమ అరెస్టులకు నిరసనగా చింతూరు మండలంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 23వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో తెలుగు యువత, తెలుగు మహిళలు పాల్గొన్నారు. ఈ నిరాహార దీక్షలలో సిపిఐ పార్టీ డివిజన్ నాయకులు మోహన్ రావు, డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్కే రంజాన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

విశాలాంధ్ర - విఆర్ పురం: మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎ. ఎస్. డి. ఎస్. సంస్థ అధినేత వి. గాంధీ బాబు పేర్కొన్నారు. 3000 మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గోదావరి వరదల్లో పిల్లల స్కూల్ బ్యాగులు కోల్పోయిన వారికి 50 బ్యాగులు పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతను మరింత ఆదరించాలి

విశాలాంధ్ర- విశాఖ సిటీ: భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని టాలీవుడ్ నటి, దామిన్ని విల్లా, లవ్ ఇన్ వైజాగ్ ఫేం రేఖ బోజ్ అన్నారు. బీచ్ రోడ్ లో గల థ గేట్వే హోటల్ లో వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శన నటి రేఖ భోజ్ బుదవారం ప్రారంభించారు. ప్రదర్శనలో కొలువుదీరిన చేనేత కారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, వాటి తయారీ గురించి ఆమె తెలుసుకున్నారు. నిర్వాహకులు శ్రీలత ఎలమంచిలి మాట్లాడుతూ ఈ నెల 9వ తేది వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశం లోని 16 నగరాల నుండి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్, పట్టు వస్త్రాలు, బెనారస్, పోచంపల్లి, చందేరి, కాశ్మీరీ సిఫాన్, చాందాని, మైసూర్ సిల్క్, ప్రింటెడ్ సిల్క్ వంటి మరో 30 నుండి 40 రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

కొత్త వాటర్ ట్యాంక్ ఏర్పాటు హర్షనీయం

విశాలాంధ్ర - చింతపల్లి: శిథిలమైపోయిన సోలార్ పవర్ వాటర్ ట్యాంక్ స్థానంలో నూతన ట్యాంకు ఏర్పాటు చేయడం హర్షనీయమని వైసీపీ నాయకుడు, లంబసింగి పంచాయతీ మాజీ సర్పంచ్ కొర్రా రఘునాథ్ అన్నారు. మండలంలోని లంబసింగి పంచాయతీ చిట్రాలగొప్పు గ్రామంలో గత కొన్నేళ్ళుగా సోలార్ పవర్ ట్యాంక్ ద్వారా గ్రామస్తులకు నీరు అందేది. ఎండకు ఎండి, వానకు తడవడం వలన గత నెలలో వీచిన ఈదురు గాలులకు వాటర్ ట్యాంక్ పగిలి తునాతునకలైంది. స్పందించిన సర్పంచ్ కొర్రా శాంతి కుమారి, తన భర్త అయిన మాజీ సర్పంచ్ రఘునాథ్, మరో సీనియర్ నాయకుడు రావుల నూకరాజులతో కలిసి సమస్యను గ్రామీణ నీటిపారుదల శాఖ డి ఈ రుక్మేంద్రరావు, ఏ ఈ స్వర్ణలత ల దృష్టికి తీసుకువెళ్లి, గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. స్పందించిన వారు కొత్త వాటర్ ట్యాంక్‌ను ఇవ్వడంతో మాజీ సర్పంచ్ రఘునాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి కుమారి, మాజీ సర్పంచ్ రఘునాథ్, వైకాపా నాయకుడు రావుల నూకరాజులతో పాటు, గ్రామీణ నీటిపారుదల శాఖ డిఈ, ఏ ఈ లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.8.91 కోట్ల వ్యయంతో ఆహార శుద్ధి పరిశ్రమలు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: జిల్లాలో రూ.8.91 కోట్ల వ్యయంతో చిరుధాన్యాల ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు శంకుస్థాపన చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో 14 జిల్లాలో వర్చువల్‌గా 9 పరిశ్రమలకు శంకుస్థాపన, 3 పరిశ్రమలకు ప్రారంభోత్సవం ఒక పరిశ్రమకు ఎంఓయూ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని బుధవారం కలెక్టరేట్ నుండి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చింతపల్లి మండలంలో రూ.4.46 కోట్లతోను, రూ.4.45 కోట్లతో చిరుధాన్యాల ఆహార శుద్ధి పరిశ్రమలకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి.ఎస్ నంద్, పలువురు ఫార్మర్ ప్రొడ్యూసర్, గ్రూపుల రైతులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేడకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆశీస్సులతో స్టేట్ డాక్టర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బొడ్డేడలక్ష్మీ నరసింహారావుని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ పార్టీ గెలుపునకు కష్ట పడే ప్రతి కార్యకర్తకి న్యాయం జరుగుతుందనడానికి ఇది నిదర్శనం అని అన్నారు. బొడ్డేడ లక్ష్మి

నరసింహారావును వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు అభినందనలు తెలియజేస్తూ, పార్టీలో కరోనా సమయంలో సుమారు 5000 మందికి తన వైద్య సేవలు అందించి, అతి చిన్న వయసులోనే పార్టీలో గుర్తింపు పొందిన నరసింహారావు పదవికి వన్నె తేవాలని సూచించారు.నుకాంబిక దేవస్థానం డైరెక్టర్ బుద్ధ నరసింహ రాజు, భోగలింగేస్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ వాసుపల్లి తాతియ్యలు, మద్దాల సురేష్, బొడ్డేడ మోహన్, ఏడువాకుల నారాయణరావు, సత్యనారాయణ మాష్టారు పాల్గొన్నారు.

కురిడిలో గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మండలంలోని కురిడి పంచాయతీలోని 40 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల నిర్మాణాల చర్యల్లో భాగంగా కురిడీలోని చేపట్టే భవన నిర్మాణాన్ని సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల ప్రత్యేక చొరవతో నిర్మాణ గుత్తేదారుడు నిర్మాణ పనులు వేగవంతం చేయడం ఆనంద దాయకమని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బాగా ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, పంచాయతీ సర్పంచ్ లచ్చు, అరకు గ్రామ పంచాయతీ సర్పంచ్ గుగుడు శారద, మండల అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు వైసిపి మండల మహిళా నాయకురాలు శాంతి, డిప్యూటీ ఎడ్యుకేటెడ్ ఇంజనీర్ రామం, జేఈ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ఘాతానికి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం గ్రామంలో సెక్యూరిటీ విధులను నిర్వహిస్తున్న గద్దం రమేష్ (42) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి బుధవారం మృతి చెందాడు. రమేష్ గతంలో ఆర్మీలో పూర్తి కాలం పనిచేసే రిటైర్మెంట్ అనంతరం ఏపీ జెన్కోలో సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. రమేష్ స్వస్థలం కడప జిల్లా, అనీ తెలిసింది. మోతుగూడెం సబ్ ఇన్స్పెక్టర్ గోపాల్ రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనకాపల్లి జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులుగా పెంటకోట

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి జర్నలిస్ట్ ఫోరం (ఏపీడబ్ల్యూజేఎఫ్) అధ్యక్షులుగా పెంటకోట సత్యనారాయణను (పెంటకోట పవర్) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనకాపల్లి ప్రైవేట్ భవనంలో జర్నలిస్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి వి.రమణ (నేషనల్ న్యూస్ ఎక్స్ ప్రెస్) ఉపాధ్యక్షులుగా పెంటకోట జగన్నాధ రావు (మన్యసీమ) జాయింట్ సెక్రటరీ డిఎన్ కుమార్ (స్టార్ న్యూస్) కోశాధికారి బొడ్డేడ కృష్ణ,(జనం న్యూస్) కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల భాను(దళపతి) వై దేముల నాయుడు(హంటర్ విజన్) కోన సంతోష్(దళిత కలం) సుబ్రమణ్యం(షార్ప్ న్యూస్), విల్లూరి హరికృష్ణ (గ్రేటర్ టుడే) ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు భీమరశెట్టి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆశా కార్యకర్తలకు పారితోషకం

విశాలాంధ్ర - హుకుంపేట: ఐసిఎంఆర్ గీతం టీబి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఉప్ప హుకుంపేట వీహెచ్ సీ లో గల టీబి పేషెంట్లకు ఫాలోఅప్ చేస్తున్న ఆశా కార్యకర్తలకు పారితోషకం అందజేస్తున్నామని డిసిటివో వైద్యాధికారి విశ్వేశ్వరరావు నాయుడు తెలిపారు. బుధవారం ఉప్ప ఆసుపత్రిలో నిర్వ హించిన కార్యక్రమంలో ఆయన చేతుల మీదగా గ్రామాలలో టీబీ వ్యాధిగ్రస్తులకు సేవలందించడంలో ప్రముఖ పాత్ర పోషించినటువంటి ఆశా కార్యకర్తలకు పారితోషకం అందించారు. టీబీ వ్యాధిపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి, అనూష, స్టాఫ్ ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ అనిల్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ మురళి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మఠం పంచాయతీ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - హుకుంపేట : ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా మఠం పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంత కుమారి హామీ ఇచ్చారు. బుధవారం మఠం పంచాయతీలోని సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. రూ 20 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో మొదటి విడుత లో జాకార వలస, బొండాల మామిడి, ఎం కోత్తురు గ్రామాల్లో సి సి రోడ్లు, డ్రైనేజి ల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు పాంగి మత్స్యకొండబాబు, మఠం సింహాచలం నాయుడు, రాములమ్మ, పి.లక్ష్మి, కె.అప్పారావు, వీఆర్ఓ సూర్యప్రకాష్ రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థులకు అభినందన



విశాలాంధ్ర - మారేడుమిల్లి: స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినిలు కుంజం సుస్మిత, కుర్ల సౌజన్యలను ఐటిడిఎ పిఓ సూరజ్ గనోరే అభినందించారు. కులుమునాలి ప్రాంతంలో ఉన్న అటల్ బిహారీ వాజపేయి నేషనల్ అకాడమిలో శిక్షణ పొంది ఆ ప్రాంతంలో ఉన్న 15,500 అడుగుల పర్వత శిఖరాన్ని అధిరోహించారు. ఈ సందర్భంగా మంగళవారం పీవో ఛాంబర్‌లో విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అలాగే ఇంటర్ డిస్ట్రిక్ స్టేట్మెంట్లో మడకం నాగలక్ష్మి గత నెలలో జావలిన్ త్రో మొదటి స్థానం సాధించింది. అలాగే ఈ నెలలో జరగబోయే వరంగల్ సౌత్ జోన్ నేషనల్‌కు ఎంపిక అయింది. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏఎస్‌పి జగదీష్, జిల్లా అటవీ శాఖ అధికారి జిజి నరేంద్రన్, ఏకలవ్య ప్రిన్సిపాల్స్ టి అరుణ కుమారి, విటల్, పిఈటి దూడ ప్రమోద్, వైస్ ప్రిన్సిపల్ సురేష్ పాల్గొన్నారు.

కందిపప్పు గింజలతో వరల్డ్ కప్ నమూనా

విశాలాంధ్ర - మాకవరపాలెం: వరల్డ్ కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మాకవరపాలెం మండలంలోని తూటిపాల గ్రామానికి చెందిన రవికుమార్ కందిపప్పు గింజలతో కప్ నమూనా తయారు చేశారు. గురువారం నుంచి వరల్డ్ కప్ క్రికెట్ పోటీలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 8 గంటలు శ్రమించి 353 కందిపప్పు గింజలతో వరల్డ్ కప్ నమూనా తయారు చేసినట్టు రవికుమార్ తెలిపారు.

పశువులమందపై దూసుకువెళ్లిన టిప్పర్ లారీ



విశాలాంధ్ర - జికేవీధి: జికేవీధి మండలం రింతాడ పంచాయతీ చాపగెడ్డ గ్రామ సమీపంలో బుధవారం పశువుల మందపై అదుపు తప్పిన టిప్పర్ లారీ వేగంగా దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో సుమారు ఏడు పశువుల వరకు మృతి చెందాయి. దీంతో పశువుల యాజమానులు బోరున విలపిస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని, డ్రైవర్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యం

విశాలాంధ్ర - చీడికాడ: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదవారికి మెరుగైన వైద్యం అందుతుందని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఖండివరం గ్రామంలో జగనన్న సురక్ష నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లాకలెక్టర్ రవిసుభాస్ పటాన్ శెట్టిలు విచ్చేశారు. రోగులకు వైద్యం అందించి వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని విశాఖ అనకాపల్లి హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరచా జయమ్మ, నారాయణమూర్తి, జడ్పిటిసి లాలం శారదావరలక్ష్మి, జానకిరామ్, వైకాపా మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, తహశీల్దార్ రాణి, ఎంపీడీవో జయ ప్రకాశరావు, ఎంపీటీసీ గంజి స్వాతి, కో ఆప్షన్ సభ్యులు షేక్ సూర్యనారాయణ, సుంకర శ్రీనివాస రావు, మూసూరి సన్నిబాబు పాల్గొన్నారు.

అరకులోయ: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా అంటూ అరకు నియోజక వర్గం వైసీపీ సీనియర్ నాయకుడు సమర్ది భాస్కరరావు,

పాంగి చిన్నారావు అన్నారు. బుధవారం సిరిగం పంచాయతీ పరిధిలో గల తెగడవలస గ్రామాల్లో గిరిజనులకు జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన పరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య శిబిరాలు నిర్వహించి అవసరమైన మందులను, డాక్టర్లను గ్రామాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పల్టాసింగ్ విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ గోల్లూరి ప్రసాద్, గుడివాడ ప్రకాష్‌రావు, హెచ్చి అప్పలరాజు, బూర్జ సుందర్రావు, పరుశురాం సుమారు 60 మంది నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో గిరిజనులకు ఎంతగానో మేలు చేకూరిందని

ఎంపిపి కూడా రాజుబాబు, జేడ్పిటీసీ సభ్యుడు రేగం మత్యలింగం అన్నారు. బుధ వారం మండలంలోని ఓల్డా పంచాయితీ కేంద్రాంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 407 మందికి వైద్య సేవలు అందించినట్లు ఉప్ప పిహెచ్‌సి వైద్యాధికారిణి డా.అనుషా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఈవోపీఆర్డి అశోక్ కుమార్, డీటీ రంగారావు, ఐసిడిఎస్ సీడీపీవో బాలచం ద్రమణిదేవి, జిల్లా వాణిజ్యా విభాగం అధ్యక్షుడు ఓ.శామ్యూల్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, జేసీయస్ ఇంచార్జీ రామకృష్ణా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ కొండలరావు, సర్పంచ్లు పొంగి బాలమ్మ, గుమ్మ శ్యామసుందర్ తదిరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: గిరిజనులకు జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక జడ్పిటిసి లిడాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. జి. మాడుగుల మండలం పాలమామిడి సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రామకృష్ణ, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు మత్స్యా కొండం నాయుడు, ఎంపిటిసి సన్యాసి దొర, జిల్లా మైనార్టీ అధ్యక్షులు నాగూర్ బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - చోడవరం: మండలంలో గల ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి పి.వి. ఎస్.ఎన్.రాజు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని బుదవారం సందర్శించి అక్కడ ఉన్న వైద్యాధికారులు, రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసు కున్నారు. నియోజకవర్గ కేంద్రంగా వున్న చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ముఖ్యంగా మార్చురీ రూము పూర్తిగా శిథిలమైపోవడం వల్ల ఇక్కడ ఇక్కడ మార్చురీ ప్రక్రియ ఆగిపోవడంతో అనునిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జనరేటర్ లేకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులుకు గురవడంతో బాటు కరెంట్ లేకపోవడం వల్ల ఆపరేషన్ థియేటర్లో ఆపరేషన్ సౌకర్యాలు అందించడంలో తీవ్ర జాప్యం కలుగుతోందని తెలిపారు. ఆసుపత్రిలో జనరేటర్, ఎక్స్ రే ప్లాంట్ తదితర అవసరాల కోసం జిల్లా కలెక్టర్, వైద్యాధికారులను కలిసి జనసేన పార్టీ తరఫున వినతిపత్రం అంద జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజు వెంట జనసైనికులు అల్లం రామ అప్పారావు, గూనూరు మూలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బయటకు వచ్చే వరకు దీక్షలు చేపడతాం

విశాలాంధ్ర - వి. మాడుగుల: మాడుగుల నియోజకవర్గ కేంద్రంలో చంద్రబాబుకి జరుగుతున్న అన్యాయానికి, అక్రమ రిమాండ్‌కు నిరసనగా మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పివిజి.కుమార్ ఆధ్వర్యంలో 22వ రోజు బుధవారం కూడా నిరాహారదీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా పివిజి.కుమార్ మాట్లాడుతూ ఎటు వంటి ఆధారాలు లేకుండా, కేవలం ఆరోపణలతో అరెస్టు చేసి రిమాండ్ కు పంపించడం చాలా దారుణం అని ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎంపిపి పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, చిన్నం నాయుడు, మండల పార్టీ సెక్రటరీ ఉండూరు దేముడు, నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ ఇంఛార్జి జురెడ్డి రాము, క్లస్టర్ ఇంఛార్జిలు పుప్పాల రమేష్, డీడీ నాయుడు, గొల్లవెల్లి శ్రీరామ మూర్తి, యూనిట్ ఇంఛార్జిలు అప్పన రమణ తదితరులు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన కృష్ణారావుపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - హుకుంపేట: పాటి భవాని అనే గిరిజన మహిళకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసు కొని వదిలేసిన సరసంగి కృష్ణారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు మృతురాలు అక్క పాటి పుణ్యవతి డిమాండ్ చేశారు. పాటి భవానిని పెళ్లి చేసుకొని చోడవరంలో కాపురం పెట్టాడని అయితే అతనికి ముందే పెళ్లి అయి బార్య బాకురులో ఉందని తన చెల్లిని బాధ పెడుతున్నాడని గతంలో హుకుంపేట పోలీసుకు పిర్యాధు చేసిన స్పందించ లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. చోడవరంలో ఉంచిన భార్యతో నిత్యం గోడవలు పెట్టుకొని తన మొదటి భార్య వద్ద ఉండిపోవటంతో మనస్థాపం, మానసిక బాధతో భవాని బుధవారం మృతి చెందిందని వారు పేర్కొన్నారు. హుకుంపేట పోలీసులకు పిర్యాధు చేసి 3 నెలలు అయిన కృష్ణారావుపై ఎటువంటి చర్యలు స్థానిక ఎస్ ఐ తీసుకోకపోవటంతోనే భవాని మృతి చెందిందని కుటుంబ సభ్యులు కోరారు. దీనిపై ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు రాగానే పాత రిపోర్టు వదిలేసి నూతనంగా ఆడవారినిని భయ పెట్టి రాయించుకోని కేసు పెట్టి కృష్ణారావుపై కేసు నమోదు చేసారని ఆరోపించారు. భవానికి మోసం చేసిన కృష్ణారావు, నిర్లక్ష్యం చూపించిన ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకో వాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

విజయదుర్గా దేవి ఆలయ శరన్నవరాత్రి ఉడుపు రాట

విశాలాంధ్ర - మధురవాడ: శ్రీ విజయదుర్గా దేవి ఆలయ శరన్న వరాత్రి ఉడుపు రాట మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. టైలర్స్ కాలనీ శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ ధర్మకర్తలు బంగారు సుబ్బారావు,లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ శాస్త్రోక్తంగా ఆలయ ప్రాంగణంలో ధర్మకర్త మండలి సభ్యులు బంగారు అశోక్ కుమార్, ఝాన్సీ దంపతులచే పూజలు జరిపించారు ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మీ మాట్లాడుతూ మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారి శరన్నవరాత్రి మహో త్సవములను అత్యంత భక్తి శ్రద్ధ లతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 15 తేదీ నుండి అక్టోబర్ 24వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ 7వ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, నగరాల కార్పొరేషన్ ఛైర్మెన్ పిళ్ళా సుజాత సత్యన్నారాయణ దంపతులు, ఆలయ ధర్మకర్త మండలి నిర్వాహకులు బంగారు ప్రకాష్,తెంటు మాధవి వైసీపీ సీనియర్ నాయకులు పసుపులేటి గోపి,అల్లాడ లింగేశ్వరావు,వట్టికుల నాగమ్మ, బెల్లాన పాపారావు, అప్పన్న, దత్తి వాసు, అడ్వకేట్ లక్ష్మణ్, రమణమూర్తి తదితరులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ద్రోణంరాజు శ్రీనివాస్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్వర్గీయ మాజీ శాసనసభ్యులు ద్రోణంరాజు శ్రీనివాసరావు 3వ వర్ధంతిని పురస్కరించుకొని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆయన చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యుదయానికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి ద్రోణంరాజు శ్రీనివాసరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ద్రోణం రాజు శ్రీవత్సవ్, వైసీపీ నేతలు పేడాడ రమణకుమారి, మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ద్రోణంరాజు శ్రీనివాస్ వర్ధంతి సందర్భంగా వైసీపీ నగర అధికార ప్రతినిధి, నాయుడుతోట హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, ఉత్తరాంధ్ర బిసి-ఈ సంఘాల నాయకులు యతిరాజుల నాగేశ్వరరావు ఘన నివాళులర్పించారు. జీవీఎంసీ 94వ వార్డు అప్పలనర్సింహ కాలనీలో గల వైసిపి కార్యాలయంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన నాగేశ్వరరావు ఆయన సమా జానికి అందించిన సేవలను ప్రస్తుతించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవింద్ పట్నాయక్, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు కంచిపాటి జగదీష్, వంకర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ సొంత నిధులతో పెన్షన్లు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91, 92 వార్డులలో ఆనంద్ కుమార్ సొంత నిధులతో 91వ వార్డులో 8 మందికి 22,000, 92వ వార్డులో 8 మందికి 17,250 మొత్తం కలిపి 16 మందికి 39,250 రూపాయలు బెహరా భాస్కరరావు చేతులమీదుగా లబ్దిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 91 వ వార్డు అధ్యక్షులు గుని శెట్టి శ్రీనివాస రావు, 92 వ వార్డు అధ్యక్షులు జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, కంచర కోటేశ్వరరావు, కొమ్మనాపల్లి త్రినాధరావు, మార్కండేయ రాజశేఖర్, కడిమి రామకృష్ణ, దాసరి శ్రీను, చుక్క పైడిరాజు రెడ్డి, చుక్క అప్పలస్వామి రెడ్డి, పి.ఎన్. రాజు, ఓ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బరువు నిర్వహణకు బాదములు తోడ్పాటు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: బాదం, ఆహారం నాణ్యతను మెరుగుపరుస్తుందని బరువు నిర్వహణలో బాదములు సహాయపడతాయని శాస్త్రీయ ఆధారాలతో రెండు కొత్త అధ్యయనాలు వెల్లడించాయని పలువురు ఆహార రంగ నిపుణులు పేర్కొన్నారు. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న వ్యక్తులు తీసుకునే తక్కువ కేలరీల ఆహారంలో బాదం జోడించడం వల్ల బరువు తగ్గేందుకు కూడా అవకాశం వుందన్నారు. మొదటి అధ్య యనం, ఒబేసిటీలో ప్రచురించబడిందని, ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా దీనికి నిధులు సమకూర్చిందన్నారు. సౌత్ ఆస్ట్రేలియా వర్సిటీ నుంచి హ్యూమన్ న్యూట్రిషన్ ప్రొఫెసర్ డాక్టర్ అలిసన్ కోట్స్, మార్ఫ్ హెల్త్ కేర్ డైటీటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్ ఈ అధ్యయనాల ద్వారా బాదముల వల్ల జరిగే మేలును వివరించారు.

బొడ్డు మోదినాయుడు వర్ధంతి

విశాలాంధ్ర - చీడికాడ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ సీనియర్ నేత బొడ్డు మోదినాయుడు 17వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన తనయుడు రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ 100 మంది నిరుపేదలకు బట్టలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు మోదినాయుడు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యర్ర అప్పారావు, దోకుల దాసు, బొడ్డు అప్పలనాయుడు, బొడ్డు మహాలక్ష్మి నాయుడు, బొడ్డు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అల్లూరి యువజన సంఘం కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర - గొలుగొండ: జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పీవీ సత్యనారాయణరావు (నర్సీపట్నం), కార్యదర్శిగా అంబటి వరహాలరాజు (కృష్ణదేవిపేట), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.సీతారామయ్య (కాకరపాడు), కార్యవర్గ సభ్యులుగా పంచాడ వెంకటరమణ, లగుడు చిన్నబాబులు (కృష్ణదేవిపేట) ఎన్నికైనట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలియజేశారు.

అడవి జంతువులను కాపాడుకుందాం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: వైల్డ్ లైఫ్ వారోత్సవాలు సందర్భంగా రాజవొమ్మంగి అటవీ శాఖ సిబ్బంది రేంజర్ అబ్బాయిదొర అధ్వర్యంలో ప్రతి గ్రామంలో అడవులు, అడవి జంతువుల సంరక్షణ కొరకు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు ఫారెస్ట్ రేంజర్ అడవి జంతువుల సంరక్షణ, అడవులను కాపాడటం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తునట్టు తెలిపారు. ఈ వైల్డ్ లైఫ్ వారోత్సవాలు ఈ నెల 2వ తేదీన ప్రారంభమయ్యాయని, 8వ తేదీన ముగుస్తాయని తెలిపారు.

భారీగా స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ క్లయిమ్ సెటిల్మెంట్స్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలోని ప్రముఖ స్టాండలోన్ ఆరోగ్య బీమా సంస్థ అయిన స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ విశాఖపట్నంలో గత 15 నెలలుగా, అంటే ఏప్రిల్ 22 - జూన్ 23 మధ్య క్లెయిమ్ సెటిల్‌మెంట్ పరంగా అసాధారణమైన ప్రదర్శనను కనబరిచినట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలో కంపెనీ రూ.33 కోట్ల క్లెయిమ్‌లను సెటిల్ చేసింది. తద్వారా తమ కస్టమర్ల సంతృప్తి మరియు ఆర్థిక భద్రత పట్ల తమ నిబద్ధతను మరింత పటిష్టం చేస్తుకుంది. కంపెనీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్ల రూపంలో రూ.30 కోట్లు మరియు రీజియన్‌లోని నాన్-నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.3 కోట్లకు పైగా క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లను చెల్లించింది.

కుందూలూరు ములకనపల్లి రోడ్లు నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండలంలోని ములకనపల్లి, కుందులూరు గ్రామపంచాయితీలలో ప్రధాన సమస్యలైన రోడ్లను తక్షణమే నిర్మాణం చేయాలని కోరుతూ బుధవారం చింతూరు ఐటి డి ఏ వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారికి వివిధ గ్రామాల రోడ్ల సమస్యలు తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు మండలంలోని ములకనపల్లి, కుందులూరు గ్రామ పంచాయితీల పరిధిలోని 14 గ్రామాల ప్రజల రహదారి సౌకర్యాలు 108,104. సేవల నిమిత్తం ఆ గ్రామాలకు ఇప్పటి వరకు రావడం లేదనీ వివరించారు. ఈ గ్రామాల నుండి మండల కేంద్రానికి వెళ్ళాలంటే సుమారు 20 కి.మీ. ఉంటుంది. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు, మరియు ప్రభుత్వ ఆసుపత్రి బ్యాంకు లకు నిత్యఅవసరాల నిమిత్తం వెళ్లాలన్న ప్రజలు నానా అవస్థలు పడుతున్నదుస్థితి నెలకొన్నది పేర్కొన్నారు ప్రభుత్వ అధికారులు పంటించుకోడం లేదని,తక్షణమే అట్టి రోడ్లు పూర్తి చేయాలని రోడ్లలను పరిశీలించి. నిధులు మంజూరు చేయగలరని కోరారు పెద్ద మట్టపల్లి నుండి నర్సింగపేట వరకు బి.టి. రోడ్డు 16.2 కి.మీలకు నిధులు 4 కోట్ల. 33 లక్షలు మంజూరు అయిన వదిలేసి సుమారు 3 సం?రాలు అవుతున్నదని దీనిని తక్షణమే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు తెల్లవారి గూడెం నుండి గుల్లేటివాడ వరకు బి.టి. రోడ్డు సుమారు 3.2 కి.మీ నిధులు రూ. 159.29 లక్షలు మంజూరు అయిన రోడ్డు పై మెటల్ పరిచి 2సం?రాలు అవుతున్నదని దీనిని తక్షణమే పూర్తి చేయాలి. కారంగూడెం బి.టి. రోడ్డు జంక్షన్ నుండి ఎ.జి. కోడేరు వరకు రోడ్డు మరమత్తులు చేయుట గురించి కుందులూరు బి.టి. రోడ్డు నుండి జల్లివారిగూడెం వరకు మెటల్ రోడ్డుకు నిధులు మంజూరు కందులూరు నుండి టేకులూరు వరకు మెటల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని గొల్లగూడెం నుండి వీరపాపనకుంట వరకు మెటల్ రోడ్డు కు నిధులు మంజూరు చేయాలి. జల్లివారిగూడెం నుండి బంగారుగూడెం మధ్యలో వాగు కల్వర్టుపనిని సగం మధ్యలో పని వదిలి వేశారని దీనిని పూర్తి చేయాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడి అధికారులకు ఇవ్వడం జరిగింది. దీనిపై వారు స్పందించి పై అధికారులు తెలియజేసి పని అయ్యేలాగా చూస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి సిపిఎం జిల్లా నాయకులూ పూనెం సత్యనారాయణ మండల కార్యదర్శి సోయం. చిన్న బాబు పంకు. సత్తిబాబు, మారయ్య వడ్లాధి. రమేశ్ తాతబాబు మాజీ సర్పంచ్ రవ్వ బుచ్చయ్య చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్ ఆయా గ్రామాల ప్రజలు గిరిజనులు పాల్గొన్నారు.

విశాఖలో వరల్డ్ స్పేస్ వీక్ కార్యక్రమాలు ప్రారంభం

- రఘు ఇంజనీరింగ్ కళాశాల లో 8వ తేదీ వరకు నిర్వహణ

- షార్, శ్రీహరికోట కేంద్రం ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో-) ల ఆధ్వర్యంలో విశాఖలోని రఘు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు - 2023 ని పురస్కరించుకొని నాలుగు రోజులు పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మేఘాలయ హొటల్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ చైర్మన్ జి .అప్పన్న లు కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 4 నుండి 10 వ తేదీ వరకు అంతరిక్ష వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. 2023 సంవత్సరానికి స్పేస్ అండ్ ఎంటర్ ప్యునర్షిప్ అంశంపై కార్యక్రమాలను నిర్వహించాలని వరల్డ్ స్పేస్ వీక్ అసోసియేషన్ నిర్ణయించింది. స్పేస్ పోర్ట్ ఆఫ్ ఇండియా గా పిలిచే షార్, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఎంతో దార్శినికంగా పని చేస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన, చైతన్యం పెంపొందించే దిశగా నాలుగు రోజులు కార్యక్రమాలను విశాఖ వేదికగా నిర్వహిస్తున్నామని తెలిపారు. చంద్రయన్-3, ఆదిత్య-1.1 విజయాలు భారతీయ విద్యార్థులు,ప్రజలు, ఎంటర్ ప్యునర్స్ లో నూతన ఆసక్తిని కలిగిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఎక్సిబిషన్, వివిధ పోటీలు, ఇస్రో శాస్త్రవేత్తలతో ప్రత్యేక ప్రసంగాలు, సీనియర్ ఇస్రో శాస్త్రవేత్తలతో ప్రత్యేక వీడియో ప్రసంగాలు- ఇంటరాక్షన్ కార్యక్రమాలు దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ జనరల్ డా. వై. శ్రీనివాస రావు జేఎన్ టియు విజయనగరం విసి ఆచార్య కె.వెంకట సుబ్బయ్య షార్ చీఫ్ జనరల్ మేనేజర్ వెంకట రెడ్డి అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను ప్రధానం చేస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానం, పరిశోధనల పై ఆసక్తినీ పెంచే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విలేఖరుల సమావేశంలో రఘు విద్యా సంస్థల సిబ్బంది, షార్ , ఇస్రో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

30 మందికి ఉద్యోగ నియామక పత్రాలు జారీ

విశాలాంధ్ర - కొయ్యూరు : ఉజ్వల మల్టీ రీఛార్జ్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడం అభినందనీయమని కొయ్యూరు సీఐ స్వామినాయుడు పేర్కొన్నారు. ఉజ్వల మల్టీ రీఛార్జ్ కంపెనీ ఎంపిక చేసిన అల్లూరి సీతా రామరాజు జిల్లాకు చెందిన 30 మంది అభ్యర్థులకు కొయ్యూరు సీఐ స్వామినాయుడు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. జిల్లా కోఆర్డినేటర్ గా నియమించిన మండలానికి చెందిన అర్జున్ రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ఉజ్వల మల్టీ రీఛార్జ్ యాజమాన్యం ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. ఈ యాప్ వినియో గించడం వల్ల ఉపయోగాలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మిగిలిన మండలాల్లో కూడా మండల కోఆర్డినేటర్లను నియమించాలని కంపెనీ యాజమాన్యానికి సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధినేత గౌరినాయుడు, సిబ్బంది చంద్రరావు అరిమెల రాజు తదితరులు పాల్గొన్నారు.

'అడపవలస'లో తాగునీటి సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : మండలంలోని సాగర పంచాయతీ పరిధిలోగల అడప వలస గ్రామంలోని తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఆ గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ అడపవలస గ్రామంలోని 70 కుటుంబాలు ఉండగా 280 జనాభా కలిగి ఉన్న ఈ గ్రామంలో గత రెండు మాసాలుగా తాగునీటి సమస్య పట్టిపీడిస్తుందని ఆయన చెప్పారు. ఫలితంగా గ్రామ ప్రజలు దాహార్తి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. గ్రామంలో సరపరకై వినియోగంలో ఉన్న కరెంటు బోరు మిషన్ మరమత్తుకు గురి కావడంతో నీటి సరఫరా అవ్వక పలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. అధికారులు స్పందించి మరమ్మతుకు గురైన బోరును మరమ్మత్తు చేయించి గ్రామ ప్రజల నీటి సమస్యను తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు చెద్ద మంజుల, తామర్ల పూర్ణిమ్మ, కొర్ర మితుల, వంతల వంజన తదితరులు పాల్గొన్నారు.

కాకరపాడు గురుకుల కళాశాల విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర - కొయ్యూరు : మండలంలోని కాకరపాడు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న కిముడు లక్ష్మణ్ పృథ్వి (18) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం సంతబయలు గ్రామానికి చెందిన పృధ్వి కాకరపాడు గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని నెలలుగా ఆరోగ్యం బాగోలేదంటూ రాజేంద్రపాలెం లోని మేనమామ పురం అప్పారావు ఇంట్లో ఉంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి సమయంలో గుర్తించిన బంధువులు హుటాహుటిన విద్యార్థిని 108 అంబులెన్స్ లో రాజేంద్రపాలెం పీహెచ్సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. ఈ విషయమై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

106 కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : అక్రమంగా రవాణా అవుతున్న 106 కిలోల గంజాయిని గాజువాక మండలం అగనంపూడి దరిగల లక్కరాజుపాలెం వద్ద టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు.. గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని దువ్వాడ పోలీసులకు అప్పగించారు. దువ్వాడ సిఐ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఎంపీడీవో వీరకిషోర్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - మారేడుమిల్లి : మారేడిమిల్లి ఎంపీడీవోఏ వీర కిషోర్ ఆరు నెలల ట్రైనింగ్ కి వెళ్లిన సంగతి తెలిసిందే, ట్రైనింగ్ పూర్తి చేసుకొని బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీర కిషోర్కి ఆఫీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫ్లెయిర్ బ్రాండ్ నూతన టీవీసీ విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ : భారతదేశంలో పెన్నుల విభాగంలో అతిపెద్ద ప్లేయర్ అయిన ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తన తాజా బ్రాండ్ ప్రచారమైన 'బాస్ ఫ్లెయిర్ ఔర్ కుచ్ నహీ'ని ప్రముఖ బాలీవుడ్ సూపర్ స్టార్ రణ్వీర్ సింగ్తో ప్రారంభించిన టు ఆ సంస్థ ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. వేగవంతమైన డిజిటల్ యుగంలో, సాంకేతికత తరచుగా ప్రధాన దశకు చేరు కుంటుందని, ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పెన్నును కాగితంపై ఉంచడానికి ఒక కలకాలం ఉండదని నమ్ముతుందన్నారు. బ్రాండ్ ఫ్లెయిర్ రైటోమీటర్ యొక్క ప్రత్యేక లక్షణాన్ని హైలైట్ చేసే మరో టీవీసీ 'లిఖ్ కే దు క్యా'ని కూడా వదిలివేసిందన్నారు, రణ్వీర్ సింగ్ను అతని సంతకం హై-స్పిరిటెడ్ స్టైల్లో చూపించి, బ్రాండ్ ఫ్లెయిర్ రైటోమీటర్ వరకు వ్రాయగలదని, 10,000 మీటర్లు. ఈ ప్రకటనల ద్వారా, చేతితో వ్రాసిన పదాల భావోద్వేగ శక్తిని ప్రజలకు గుర్తు చేసే లక్ష్యంతో ఉందని చెప్పారు.

వజ్రగడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ప్రాధమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రోగులు భారీగా వచ్చి వైద్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా వైద్యులు వారిని పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అరుణశ్రీ, వైసిపి మండల అధ్యక్షులు రుత్తల శ్రీనివాస్, నాయకులు త్రినాథ్, భద్రాచలం, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయి వికలాంగులకు రూ.5000 పెన్షన్ వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండలంలో ఎల్ సింగవరం గ్రామం లో పూర్తి స్థాయిలో ఇంటికే పరిమితమైన ముగ్గురు వికలాంగులకు సాధారణంగా నెలకు రూ.3000/- అందుకుంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ వేపాడ మధు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు.వెంటనే ఆయన సంబంధించిన అధికారులతో మాట్లాడి వీరికి నెలకు 5 వేలురూపాయలు పెన్షన్ వచ్చేలా కృషిచేసి వారికీ ఈ నెల నుండి 5 వేలురూపాయలు పెన్షన్ రావడంతో వారికి స్థానిక సర్పంచ్ చేతులు మీదుగా ముగ్గురు వికలాంగులకు అందించారు.ఈ ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే ధర్మశ్రీకి స్థానిక సర్పంచ్కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును వెంటనే విడు దల చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో పట్టణంలో ముస్లిం వీధిలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంది కాశీవిశ్వనాద్, పల్లా విలియం కేరి, మలిపెద్ది వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, పెదిరెడ్డి నాగ వెంకట రమణ, పిన్నింటి సూరిబాబు, వేములపూడి అప్పారావు, చిరుకూరి పేర్రాజు, రాజాన ఆది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలాన్ని లీజ్కు ఇవ్వకుండా ఆపాలి

విశాలాంధ్ర - మాడుగుల : మండలకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలాన్ని లీజ్కు ఇవ్వకుండా ఆపాలని కోరుతూ న్యాయవాది శ్రీనాదు ప్రసాదరావు జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పటాన్ శెట్టి దృష్టికి తీసుకువెళ్లారు అనంతరం స్పందన కార్యక్రమంలో మండల సతీష్ రోబ్బ మహేష్ తదితరులతో కలిసి వినతిపత్రం అందజేశారు ఈసందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ గతంలో సుమారు ఏడున్నర ఎకరాల స్థలం డిపో నిర్మాణం కొరకు సేకరించా రని ఆ స్థాలంలోఆర్టీసీ కాంప్లెక్స్ బిల్డింగు కట్టినప్పటికీ నిరుపయోగముగా ఉందన్నారు ఆ స్థలంలో డిపో ఏర్పాటు చేసి కాంప్లెక్స్ వినియోగంలోకి తేవాలన్నారు.

యోగ పోటీలలో జాతియా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీలలో, అలాగే కర్నూల్ లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ సెంటర్లో ఉచితంగా యోగాలో శిక్షణ పొందుతున్న పిల్లలు, పెద్దలు విజేతలుగా నిలిచి బహుమతులు సాధించారు. జాతీయ స్థాయిలో ఎస్. ఆకర్ష్ (ప్రథమ బహుమతి),జి. గోవర్ధన్ (ద్వితీయ బహుమతి) ఎన్.ప్రేమేష్ (ద్వితీయ బహుమతి) కె. బావ్య(ద్వితీయ బహుమతి),డి. భవ్యతి (తృతీయ బహుమతి) ఎస్. వర్షిత్.(తృతీయ బహుమతి) లతోపాటు రాష్ట్రస్థాయిలో శ్రీమతి శాంతి (ప్రథమ బహుమతి) సాధించారు.వారికి సంస్థ తరఫున కోలపర్తి జయబాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులైన బొద్దపు అప్పారావు, జి.మంగయ్య, రంగారావు, శ్రీనివాస రావు , త్రినాధ్ పాల్గొన్నారు.

కోర్రాయి వంతెనను తక్షణమే నిర్మించాలి ఆమ్ ఆద్మీ జిల్లా ఇంఛార్జి సుజాత

విశాలాంధ్ర - దుంబ్రిగూద : మండలంలోని కోర్రాయిలో తక్షణమే వంతెన నిర్మాణాన్ని చేపట్టి రాకపోకల గిరిజనుల సౌకర్యానికి తోడ్పాటు ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్చార్జి మొస్య సుజాత సల్మాన్ ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. శంకుస్థాపన శిలాఫలకానికే పరిమిత మైన వంతెన నిర్మాణ పనులు జరగకుండా నిలిచిపోయాయని ఆమె అన్నారు. ఈ మేరకు బుధవారం వంతెన రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామ గిరిజనులతో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనులు జరగకపోవడంతో ఆ ప్రాంతవాసులు శ్రమదానం ద్వారా రోడ్డు పనులు చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణంతోపాటు రోడ్డు సౌకర్యాన్ని కల్పించి గిరిజనులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ బలి దేవుడు ఆటో యూనియన్ నాయకులు నాగేష్ సభ్యులు మజ్జి రవి వార్డు మెంబర్ కోరాయి జంగుడ వార్డు మెంబర్ మరియు ఆమ్ ఆద్మీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతయ్య పేటలో టీడీపీ, జనసేన దీక్షలు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేటలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ రిమాండకు నిరసనగా తెలుగుదేశం, జనసేన పిలుపు మేరకు బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా 22 రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగు తు న్నాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ రిలే నిరాహారదీక్ష కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ చోడవరం నియోజకవర్గ పరిశీలకులు వీఎస్ఎన్ మూర్తి యాదవ్ నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు అధ్యక్షతన జరుగుతున్నాయి. దానిలో భాగంగానే సీతయ్యపేట గ్రామంలో స్టేట్ బ్యాంక్ పక్కన గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీను అధ్యక్షతన భారీ ఎత్తున జన సమీకరణ చేసి తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు మహిళలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, దొంకిన అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, సీతయ్యపేట సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీను, ఎంపీటీసీ కంచిపాటి శ్రీను, మాజీ ఎంపీటీసీ రుత్తల శ్రీను,కోట సత్యనారాయణ,షేక్ వల్లి,మరిశా సతీష్, మరిశా నరేష్, దొండా గిరిబాబు, సాయం శేషు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, కిర్లంపల్లి శ్రీనువాసు మరియు టిడిపి ముఖ్య నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని నేను సైతం బాబు కోసం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎట్టకేలకు చిక్కుడుబట్టి రహదారి నిర్మాణం పూర్తి ఎంపీపీ అనూష దేవి, జెడ్పీటీసీ బాలయ్య

విశాలాంధ్ర - చింతపల్లి : గడచిన కొన్నేళ్లుగా అధికారుల, గుత్తేదారుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా ఉన్నగొందిపాకల పంచాయితీ లోని చిక్కుడు బట్టి రహదారి నిర్మాణం పూర్తి అయింది. గ్రామంలో బిటి రోడ్డును ఎంపిపి కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యలు ఆ పంచాయతీ సర్పంచ్ సాగిన వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్రావులతో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తి అయినప్పటికీ చిక్కుడు బట్టి గ్రామానికి రహదారి చిక్కులు తొలగించడంలో గత ప్రభుత్వాలు మీన మేసాలు లెక్కించాయన్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు రహదారి సదుపాయానికే గాక, రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి ఈ గ్రామాన్ని సందర్శించినప్పుడు రహదారి పరిస్థితిని గ్రామస్తుల ద్వారా తెలుసుకొని వెంటనే రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణం నేడు పూర్తి అయిందని, ఆ రహదారిని తమ చేతులమీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రహదారి నిర్మాణం పూర్తి అయినందుకు గ్రామస్తులు, మహిళలు, ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జెఈ బాలకిషోర్, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

డి-పట్టా భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట : గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన డి-పట్టా భూములను పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని మండలం లోని పాల్మాన్పేట, రాజయ్యపేట, కొర్లయ్యపేట గ్రామాలకు చెందిన దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ కె.నూకరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేకా మురళిప్రసాద్, గంపల రాంబాబు మాట్లాడుతూ మండలంలోని ఈదటం గ్రామ రెవెన్యూ పరిధిలోని పాల్మాన్పేట, రాజయ్యపేట, కొర్లయ్యపేట గ్రామాల్లో నిరుపేదలకు గతంలో డి-పట్టా భూములు పంపిణీ చేసినట్లు తెలిపారు. నిరక్షరాస్యులం కావడం వలన తమకు చెందిన భూములు ఇతరుల ఆక్రమించుకున్నట్లు తెలిపారు. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తెలిపారు. తమ భూములు తమకు అప్పగించి, భూములను పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాతాడ పెద్దిరాజు, నేలపాటి గోపి, మేకా రామకృష్ణ, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందనే భయంతో అక్రమ కేసులు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో అక్రమ అరెస్టు లకు పాల్పడు తున్నారని రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్) అన్నారు. బుధవారం వార్డు టిడిపి పార్టీ కార్యాలయం నందు ఉక్కు ముఠా కార్మిక సంఘంతో కలిసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేతకాని ముఖ్యమంత్రి కూల్చడమే తప్పా పరిపాలించడం రాదని, ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఎన్ని అరెస్టులు చేసిన మా ఆందోళనలు ఆపలేరని, చంద్రబాబు నాయుడు విడుదల చేసినంతవరకు పోరాటం ఆగదని, రానున్న ఎన్నికల్లో ప్రజలు ఈ సైకో పాలనకు చరమ గీతం పాడుతారని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజన్ రాజు, సత్తిబాబు, విజయరామరాజు, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, వద్రే రాంబాబు, దానయ్య, పివిఎన్ మూర్తి, బీ.పైడ్రాజు, కే.శీను, ఉక్కు ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే కన్నబాబు

విశాలాంధ్ర - మునగపాక : యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం వాడ్రాపల్లి సచివాలయం పరిధి లోనూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమనీ శాసన సభ్యులు యు.వి రమణ మూర్తి రాజు (కన్నబాబు) మాజీ డిసిసిబి చైర్మన్ యు.సుకుమార్ వర్మ (తేజ) ప్రారంభించారు ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి ఉచితంగా వైద్యం మందులు అందించడంతో పాటు రోగులకు సలహాలు సూచనలు ఇస్తారు కావున ప్రజలు అందరూ ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో (సచివాలయం కన్వీనర్) పెతకం శెట్టి రామ జోగినాయుడు, వార్డ్ మెంబర్లు, గృహసారధులు, గ్రామ ప్రజలు, మండల ప్రజా ప్రతినిధిలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల చేతిలో గాయపడిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించిన జనసేన నాయకులు

విశాలాంధ్ర - భీమిలి : భీమిలి నియోజక వర్గం పద్మనాభం మండలం బాందే పురం గ్రామానికి చెందిన బందేపు.పాపు (25) దళితుడును ఇట వల పోలీసులు కొట్టిన దెబ్బలకు కాలు విరిగిన వ్యక్తి ని జనసేన పార్టీ నియోజకవర్గం ఇంఛార్జి సందీప్ పంచకర్ల ఆదేశాల మేరకు జనసేన నాయకులు నవిరి రాజు, సంతోష్, గుడివాడ.కిరణ్ కుమార్, పొట్నూరు.గోపి, దార.సతీష్, గిరి లు పరామర్శించారు. ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ.. జరిగిన సంఘటన పై పోలీస్ కమీషనర్ రవి శంకర్ వెంటనే స్పందించి దళితుడైన పాపు కాళ్ళు విరగొట్టిన పోలీసులను సస్పెండ్ చేసినందుకు జన సేన పార్టీ తరుపున హర్షం వ్యక్తం చేశారు..పాపు కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండించి ప్రజలకు రక్షణ కల్పించవలసిన పోలీస్ వారే ఇలాంటి దారుణాలు చేయడం ప్రజా సేవకు విరుద్ధమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు దళిత సంఘాలు, జనసేన పార్టీ కలిపి పోరాడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

విశాఖలో 5, 6 తేదీల్లో మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు

స్టార్టప్ ఇండియాతో కలిసి ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ నిర్వహణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : దేశవ్యాప్తంగా స్టార్టప్ ఇండియా, డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ, అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి), వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, మహిళలకోసం స్టార్టప్లను ప్రారంభించింది. దీనిలోభాగంగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం స్టార్టప్ ఇండియా, ఆంధ్రప్రదేశ్లో ఇన్నోవేషన్ సొసైటీ తో కలిసి స్టేట్ వర్క్షాప్లు నిర్వహించేందుకు ప్రతిపాదించిందని ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ కుమార్ తెంటు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 5, 6 తేదీలలో విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హొటల్ నందు రెండు రోజుల మహిళా ఎంట్రప్రెన్యూర్షిప్ వర్క్షాప్ జరుగనుందని తెలిపారు. ఈ మహిళా వ్యాపారవేత్త వర్క్షాప్ మహిళల సొంత వ్యాపారాలను పెంచుకోవడానికి, ఆసక్తి ఉన్న మహిళలకు మద్దతు మరియు సాధికారత కోసం రూపొందించబడిందని ఈ వర్క్షాప్ సాధారణంగా మహిళలు వ్యవస్థాపకులుగా విజయవంతం కావడానికి, అవసరమైన సహాయాన్ని అందించడంపై దృష్టి పెడుతుందని పేర్కొన్నారు. స్టార్టప్ ఇండియా ఈ ఈవెంట్ను ఇప్పటి వరకు 19 రాష్ట్రాల్లో ప్రమోట్ చేసిందని, మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్స హించడం మరియు మద్దతు ఇవ్వడం, అవకాశాల గురించి అవగాహన పెంచడం మరియు వారి స్వంత వ్యాపా రాలను ప్రారంభించేందుకు వారిని ప్రేరేపించడం లక్ష్యంగా ఈ సదస్సు జరుగునని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో వర్క్షాప్లను నిర్వహించడం స్థానిక స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు దోహదం చేస్తుందని. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తుందని చెప్పారు. ఈ వర్క్షాప్లో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు వాణిజ్యం, ఐటీ, చేనేత జౌళి శాఖ గౌరవ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఏపీ కార్యదర్శి కోన శశిధర్, పాల్గొననున్నారని తెలిపారు.